క్లుప్తంగా

అక్రమ మద్యం కేసులో ఐదుగురు అరెస్టు

● 51 మద్యం బాటిళ్లు, 40 లీటర్ల సారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటతో సెబ్ అధికారులు

మార్కాపురం టౌన్: మార్కాపురం సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి మార్కాపురం మండలంలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయదారులపై దాడి చేసి నాలుగు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేసినట్లు శనివారం తెలిపారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామానికి చెందిన ఎస్. కృష్ణారెడ్డి వద్ద ఉన్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మార్కాపురం మండలం ఇడుపూరు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో సీహెచ్ ప్రభాకర్ వద్ద నుంచి 22 క్వార్టర్ బాటిళ్లు, మార్కాపురం మండలం మన్నెవారిపల్లి గ్రామానికి చెందిన వల్లభనేని వెంకటనారాయణ నుంచి 14 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తుండటంతో వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన నల్లపాటి చిన్నగురుమూర్తి, పెద్దారవీడు మండలం చెంచుకాలనీకి చెందిన కుడుముల పెద్దయ్య వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారా, 1600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న సెబ్ అధికారులు

పోలీసు జీపు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్కాపురం: పోలీసు జీపు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని పెద్ద వాటర్ ట్యాంకు వద్ద జరిగింది. ఒక పోలీసు అధికారి వాహనం డ్రైవర్ తన వాహనాన్ని నడుపుకుంటూ తర్లుపాడు రోడ్డు వైపునకు వెళ్తుండగా వాటర్ ట్యాంకు వద్ద సందులో నుంచి వస్తున్న పెరుమాళ్ల కాశీరావును పోలీసు వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం

● కలెక్టర్ దినేష్‌కుమార్

దర్శి: పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం దర్శి నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఆదివారం ఇక్కడి నుంచి పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు డిస్ట్రిబ్యూట్ చేసేందుకు అధికారులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రాంగణంలో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రాంగణంలోకి వచ్చే సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన ఉండేలా సైన్ బోర్డులు, బారికేడ్‌లు, సీటింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సింగ్ సిస్టం ప్రక్రియ పూర్తిస్థాయిలో ఉండేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిబ్బందికి భోజన సదుపాయాలు, వాహనాల పార్కింగ్, ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత పరంగా కేంద్ర బలగాలతో పాటు ట్రైనీ ఐపీఎస్‌లను కూడా ఇక్కడ విధుల్లో కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామగ్రిని సిబ్బంది తీసుకెళ్లేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన చెక్ లిస్టును అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ మెజార్టీపై ధీమా

యర్రగొండపాలెం: గత 6 రోజులుగా జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మెజార్టీ ఓట్లు పోలయ్యాయని పలువురు అంచనాలు వేస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 2,246 మంది పోస్టల్ ఓటర్లు ఉండగా అందులో 1,816 మంది తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం ఓటర్లలో 221 సర్వీసు ఓటర్లు తమ ఓటును పోస్టల్ ద్వారా పంపించాల్సి ఉంది. ఆ ఓట్లు పోలింగ్ నాటికి ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌కు చేరే అవకాశం ఉంది. కాగా పోలయిన 1,816 ఓట్లలో 70 శాతం ఓట్లు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌కు పోలయి ఉంటాయని భావిస్తున్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని పలువురు వ్యాఖ్యానించారు.

వైఎస్ జగన్ సేవకుడిని నేను


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన జంకె వెంకటరెడ్డి


భారీ ర్యాలీకి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

● టీడీపీ అభ్యర్థికి పదవీ కాంక్ష
● కందుల ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌ను ప్రజలు ఎవరూ నమ్మరు
● మార్కాపురంలో అన్నా రాంబాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

మార్కాపురం టౌన్: రాజకీయాల్లోకి విలువలతో కూడిన సేవ చేసేందుకే వచ్చాననీ, పదవిని అడ్డు పెట్టుకుని అక్రమార్జనకు తానుగానీ, తన కుటుంబ సభ్యులుగానీ ఎన్నడూ చేయలేదని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు అన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని సత్యనారాయణస్వామి గుడి నుంచి రెడ్డీ కాలేజీ, విజయ టాకీస్ ఏరియా, జగదీశ్వరీ థియేటర్ తదితర ప్రాంతాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదీశ్వరీ థియేటర్ వద్ద ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ అందించారన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు పరిచిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. 2014లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా అబద్ధాల మానిఫెస్టోతో అధికారంలోనికి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తారని, తనకు ఓట్లు వేయకుంటే తన శవాన్ని చూస్తారని ప్రజలను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ ఓట్లు అడగడం ఎంతవరకు సబబనీ, తెలివైన ఓటర్లుగా మీ అందరూ ఆలోచన చేయాలని రాంబాబు కోరారు. తెలుగుదేశం అభ్యర్థి పదవితో ఏమైనా చేయొచ్చని, పదవి లేకుంటే జీవితమే లేదని ప్రజల సానుభూతి పొంది ఎన్నికల్లో గెలుపొందాలని మాయమాటలు చెబుతున్నారన్నారు. రౌడీయిజం కావాలో.. శాంతియుతంగా ప్రశాంతంగా ఉండే మార్కాపురం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. 2009 నుంచి రాజకీయాల్లో ఉన్న తాను సంపాదన కోసం అడ్డదారులు తొక్కలేదని, రాజకీయాల్లో తాను కోట్ల రూపాయలు పోగొట్టుకున్నానన్నారు. మంచిని గెలిపించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టుకు నిధులిచ్చి పూర్తి చేసింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయితే అనంతరం అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిన పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేశారని చెప్పారు. తాను అధికారంలోనికి వస్తే వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించింది తానే... నీళ్లిచ్చేది తానేనంటూ చెప్పుకోవడం సిగ్గుచేటని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తే కూటమిగా ముందుకు వస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేనలు రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడంపై ముస్లింలు ఆలోచన చేయాలన్నారు. మంచి మనసుతో ఓట్లు వేసి ఆదరించాలని అన్నా రాంబాబు కోరారు. ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ మీ ఇంటికి మంచి జరిగిందని భావిస్తే తనకు ఓటేయండని, లేదంటే వద్దని చెప్పిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు షెక్షావలి, కరీమున్, నాసర్‌వలి, సిరాజ్, కొత్త కృష్ణ, దొడ్డ భాగ్యలక్ష్మి, ఎం.శ్రీనివాసులు, నగేష్, సీహెచ్ చంద్ర, ఏఎంసీ డైరెక్టర్లు డాక్టర్ మగ్బుల్‌బాషా, పీఎల్‌పీ యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షెక్షావలి, బత్తుల సుబ్బారెడ్డి, మౌలాలీ, గుంటక చెన్నారెడ్డి, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, బండారి శ్రీను, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ అభిమానులు పాల్గొన్నారు. అనంతరం అన్నా రాంబాబు, జంకె, నాయకులను గజమాలతో ఘనంగా సత్కరించారు.

మైనార్టీల సంక్షేమానికి జగన్ అధిక ప్రాధాన్యం

● మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షంషేర్ ఆలీబేగ్, పక్కన మగ్బుల్ బాషా, నజీర్

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ చెప్పారు. శనివారం పట్టణంలోని మొఘల్స్ గెస్టు హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీతో అంటకాగిన చంద్రబాబు ముస్లిం ఓటర్లపై కపట ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో టీడీపీ ముస్లింలపై కపట ప్రేమ చూపుతూ ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయ లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ముస్లింల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారనీ, దీంతో పలువురు మైనార్టీలు డాక్టర్లుగా, పోలీసు అధికారులుగా, ఆర్‌డీఓలు, డీఎస్పీలుగా ఎంపికయ్యారన్నారు. గడిచిన 5 సంవత్సరాల కాలంలో మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా వైఎస్సార్ చేయూత ద్వారా 1613 కోట్ల రూపాయలు, వైఎస్సార్ ఆసరా ద్వారా 583 కోట్ల రూపాయలను మైనార్టీలకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఇమామ్‌లకు, మౌజమ్‌లకు చంద్రబాబు వెన్నుపోటు పొడిస్తే వైఎస్ జగన్ మౌజమ్‌లకు రూ.5 వేలు, ఇమామ్‌లకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారని, ఇప్పటి వరకు 300 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై అపర కుబేరుల పోటీ

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయిస్తే వారిపై చంద్రబాబు అపర కుబేరులను పోటీ చేయిస్తూ వారిని ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కర్నూలు, నెల్లూరు, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ ముస్లిం అభ్యర్థులను ఓడించేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అప్పట్లో జిల్లా గుర్తు రాలేదా?

2014 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు జిల్లాల ఊసేలేదని, ఇప్పుడు మాత్రం ఓట్ల కోసం కొత్త జిల్లాలంటూ నాటకాలు ఆడుతున్నారన్నారు. కృష్ణ జిల్లాకు ఎన్‌టీఆర్ పేరుపెట్టిన ఘనత వైఎస్‌కే దక్కుతోందన్నారు. కొత్త జిల్లాల ప్రకటనను ఎవరూ నమ్మరని, మార్కాపురం ప్రాంత ప్రజలు వైఎస్సార్ సీపీకే ఓటువేస్తారన్నారు. మార్కాపురంలో 2 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న షాదీఖానా రెండో అంతస్తు నిర్మాణం పూర్తయిందని, ఐదారు నెలల్లో ఎమ్మెల్యే రాంబాబు, సంబంధిత మంత్రి ద్వారా ప్రారంభోత్సవం చేస్తామన్నారు.

జిల్లాలో మైనార్టీల అభివృద్ధి ఇలా..

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో జగనన్న విద్యా దీవెన కింద 3,242 మంది విద్యార్థులకు 1,94,38,850 రూపాయలు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. జగనన్న వసతి దీవెన కింద 3,152 మంది విద్యార్థులకు 3.01 కోట్ల రూపాయలను వారి తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో షాదీఖానాల నిర్మాణాలకు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఒంగోలులో షాదీఖానా నిర్మాణానికి 2.50 కోట్ల రూపాయలు, మార్కాపురానికి 2 కోట్ల రూపాయలు, యర్రగొండపాలెం షాదీఖానా నిర్మాణానికి 35 లక్షల రూపాయలు మంజూరు చేశారనీ, వీటిలో ఒంగోలు, యర్రగొండపాలెం షాదీఖానా నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో 2020–21 ఆర్థిక సంవత్సరంలో 31 చర్చిలు మంజూరు చేసి పూర్తి చేశారనీ చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సంతమాగులూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.50 లక్షలు, సీఎస్‌పురం మండలం అరివేముల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 12 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. పాస్టర్ల గౌరవ వేతనంలో ఫేజ్–1 కింద 423 మంది, ఫేజ్–2 కింద 178 మంది మొత్తం 601 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి నెలకు 5 వేల చొప్పున గౌరవవేతనాన్ని వారి ఖాతాలకు జమ చేశారని వివరించారు. కోవిడ్ సమయంలో 2,495 మంది పాస్టర్లకు 5 వేల గౌరవ వేతనం అందించామన్నారు. ఇమామ్, మౌజమ్స్ గౌరవ వేతనం కింద జిల్లా వ్యాప్తంగా 376 మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకు ప్రతినెలా ఇమామ్‌కు 8 వేలు, మౌజమ్‌కు 5 వేల చొప్పున 48.88 లక్షల రూపాయలు అందించారని తెలిపారు. కోవిడ్ టైమ్‌లో 218 మంది ఇమామ్, మౌజమ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనంగా 10.90 లక్షల రూపాయలు చెల్లించిందని పేర్కొన్నారు. నేషనల్ స్కాలర్‌షిప్ కింద ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 1421 మందికి, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 2070 మందికి, మెరిట్ కం మీన్స్ స్కాలర్ షిప్ కింద 296 మందికి, హజరత్ బేగం స్కాలర్‌షిప్స్ కింద 170 మందిని అర్హులుగా గుర్తించినట్లు షంషేర్ ఆలీబేగ్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

జిల్లాలో ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలుగా పోటీచేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్, అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. అన్నా రాంబాబు మంచి వ్యక్తిత్వం, తోటివారికి సాయం చేసే గుణం ఉందని, గొడవలకు దూరంగా ఉంటాడని, అటువంటి వ్యక్తిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌మీట్‌లో ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్ బాషా, నజీర్ అహ్మద్, కో ఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, ఖాజాతో పాటు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న పాలన


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ మరదలు కోమలతారెడ్డి

బేస్తవారిపేట: జగనన్న పాలనలో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని, అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మరదలు కోమలతారెడ్డి కోరారు. శనివారం మండలంలోని గలిజేరుగుళ్లలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్నను మరోసారి సీఎం చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటియ్యాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీటీసీ కుంపటి సురేష్, మాజీ ఎంపీటీసీ దప్పిలి సంభూతరెడ్డి, నాయకులు మారూరి రామలింగారెడ్డి, శ్రీరామిరెడ్డి, ఇస్మాయిల్, ప్రసాద్, రంగయ్య, బాలయ్య, లక్ష్మయ్య, జేసుదాస్, కొండయ్య, పోలయ్య, రసూల్ పాల్గొన్నారు.

అన్నా, చెవిరెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలి


జగన్నాథపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

తర్లుపాడు: ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం విస్తృత ప్రచారం చేశారు. కేతగుడిపి, బుడ్డపల్లి గ్రామాల్లో సర్పంచ్ పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, ఓబాయపల్లి, లక్ష్మక్కపల్లి, లింగారెడ్డి కాలనీల్లో గ్రామ పార్టీ అధ్యక్షులు మందా కొండారెడ్డి, సర్పంచ్‌లు శిరీషాదాస్, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఆశీర్వదించాలని కోరారు. నాగెళ్లముదుపు, ఉమ్మారెడ్డిపల్లి, ఫతేపురంలో సర్పంచ్ తిరుమల బాలసుబ్బమ్మ, వైస్ ఎంపీపీ కందుల సుజాత, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైస్ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి జగనన్నను మరోసారి సీఎంగా చేసుకునేందుకు ఎమ్మెల్యే అన్నాకు, ఎంపీ చెవిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాగసముద్రంలో సర్పంచ్ రమణారెడ్డి, వైస్ సర్పంచ్ శాంతారావు, పార్టీ నాయకులు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేశారు. జగన్నాథపురంలో గంటా వెంకటరెడ్డి, నాయకులు రమేష్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

వేములకోటలో వైఎస్సార్ సీపీదే హవా


ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

మార్కాపురం: మండలంలోని వేములకోట వైఎస్సార్ సీపీ అడ్డా అని వైఎస్సార్ సీపీ నాయకులు జంకె వెంకట నారాయణరెడ్డి, జంకె మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ వీరయ్య, సర్పంచ్ గుంజె రమాదేవి అన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి స్వగ్రామంలో కచ్చితంగా వైఎస్సార్ సీపీకి మెజారిటీ వస్తుందన్నారు. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో గ్రామస్తులందరూ ఐక్యంగా వైఎస్సార్ సీపీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములకోట అభివృద్ధికి జంకె వెంకటరెడ్డి చేసిన కృషి ఎవరూ మర్చిపోరన్నారు. గ్రామంలో సిమెంటు రోడ్ల ఏర్పాటు, హైస్కూల్‌గా మార్పు చేయడం, నీటి సమస్య తీర్చడంతో పాటు జగనన్న పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించారని పేర్కొన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ ఆవులయ్య, వెంగళరెడ్డి, చిన్నబ్బి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, అరుణ్ కుమార్, పెద్ద అంకయ్య, గోగు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, గుండారెడ్డి లక్ష్మిరెడ్డి, గురవయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రచార వాహనం నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

● వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి


ఉత్సాహంగా నృత్యం చేస్తున్న వైస్ చైర్మన్ దీపికా, కౌన్సిలర్లు, మహిళా నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు గడ్డ జగనన్న అడ్డ.. ఇక్కడ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం.. గెలుపు తథ్యం అని ఆ పార్టీ అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా విజయోత్సవ సంబరాన్ని తలపించేలా శనివారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి అమ్మవారిశాల పెద్ద బజారు, పొట్టి శ్రీరాముల సెంటర్, గణేష్‌నగర్, వైఎస్సార్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత గాంధీ బొమ్మ సెంటర్‌లోని వినాయకుడి ఆలయం, రాచర్లగేటు సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీని ప్రారంభించే ముందుగా కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కల్పన, ఆయన సోదరీలు పద్మ, అరుణలు ప్రచార వాహనం ముందు నుంచి స్వాగతం పలుకుతూ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేపీ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. ప్రతి ఒక్కరి నోట ఫ్యాను గుర్తు అని బలంగా వినిపిస్తుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఒకటికి రెండు సార్లు ఆలోచించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, గిద్దలూరు మాజీ సర్పంచి శివాపురం సురేంద్రకుమార్, ఎంపీపీ కడప లక్ష్మి, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు గోన రంజిత్‌కుమార్, చైతన్య వేదిక అధ్యక్షుడు పుష్పరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, బండారు నిర్మలాదేవి, బెల్లం రమాదేవి, దేమా శ్రీరాములుయాదవ్, గురుప్రసాద్ యాదవ్, కాపు సంఘ నాయకులు కావేటి ఈశ్వర్‌నాయుడు, ముద్దర్ల శ్రీను, జానకి రంగనాయకులు, ఆర్య వైశ్య విభాగం నాయకులు గర్రె చిరంజీవి, గర్రె వెంకట సుబ్బారావు, పర్చూరి నాగేశ్వరరావు, బాదం గోపాల్, పోలేపల్లె శివ, రమణ స్వామి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, గఫూర్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన 50 ముస్లిం కుటుంబాలు గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి స్వగృహంలో శనివారం ఆయన సమక్షంలో పార్టీలో చేరాయి. 18వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్షావలి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి మహ్మద్, ఖరీమ్, బాషా, నయామ్‌లతో పాటు మరికొంత మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతు వైఎస్సార్ సీపీకి ఘన విజయం సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి ఒక్కరూ. ఫ్యాను గుర్తుపై రెండు సార్లు ఓటు వేసి వేయించేలా పనిచేయాలని కోరారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. 13వ తేదిన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఫ్యాను గుర్తుపై వేసి వినియోగించుకునేలా చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సలనూతలలో ఇంటింటా ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చిన్నపరెడ్డి) ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా ఇంటింటా ప్రచారం చేశారు. బ్యాలెట్ నమూనాలను ప్రదర్శిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. సర్పంచ్ అంజనీ శివకుమారి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు చేసేందుకు జగనన్నను తిరిగి సీఎంగా అయ్యేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వేయించి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ బత్తుల శ్రీను, వార్డు సభ్యులు ముక్కు లక్ష్మి నరసారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కందుల విజయరావు, పసుపులేటి పెద్ద కోటయ్య, పెండెం చిన్నబాబు, పార్టీ నాయకులు సానికొమ్ము వెంకట సుబ్బారెడ్డి, యిడగొట్టు చిన్న అంజయ్య, బత్తుల పెద్ద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి


కోమలతారెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మరదలు కోమలతారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పందిళ్లపల్లెలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందించి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నను గెలిపించుకుంటేనే ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సర్పంచ్ పోలక వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిలకల కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ లేపాక్షిరెడ్డి, నాయకులు కర్నాటి లక్ష్మీసునీత, కర్నాటి అయ్యపరెడ్డి, ఉప్పులూరి సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చిలకల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● సబ్ కలెక్టర్, ఆర్‌ఓ రాహుల్ మీనా


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం: ఈ నెల 13న సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా తెలిపారు. శనివారం ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 2,14,608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. మొత్తం 257 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 68 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, ఇక్కడ ప్రత్యేక బందోబస్తు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 140 వెబ్ కాస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 48 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చేందుకు సహాయకులు తెచ్చుకోవచ్చన్నారు. అన్నీ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం పోలింగ్ సామగ్రిని సిబ్బందికి అందించే ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ రోజు అభ్యర్థి 3 వెహికిల్స్‌కు మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ రవికుమార్ పాల్గొన్నారు.